విశ్వమందు విభుడు వెలుగొందు చుండును
విభునియందు విశ్వమె వెలుగుచుండు
విశ్వవిభుల మైత్రి విడదీయ రానిది
సత్యమైన బాట సాయి మాట

ఈశావాస్యమిదం జగత్. ఈ జగత్తు ఈశ్వరుడు నివసించుటకగినటువంటిది. జగత్తు అనగా మనము పుట్టి పెరిగి తిరిగి పోయేటువంటి లోకము. ఈ లోకమునకు ఆధారము భూమి. ఎడతెరిపి లేకుండా యింటా బయటా సర్వత్ర సర్వకాలములందు గాలి వీచుచున్నది. కానీ యిది మానవునకు కనుపించదు. పగలు వెలుతురు కార్యకలాపములు, ఆహార విహారములు జరుగుతూ వుంటాయి. రాత్రి కాగానే ప్రకృతి నిశ్శబ్దముగా నిద్రిస్తుంది. పగలు వెలుతురు రాత్రి చీకటి యీ వెలుతురుకు చీకటికి మధ్య వున్న సంబంధ బాంధవ్యాన్ని మానవుడు గుర్తించుటము అత్యవసరము. మానవుడు తల యెత్తి పైకి చూచినప్పుడు అనంతాకాశములో ప్రకాశిస్తున్న సూర్యుడు దేదీప్యమానంగా కనుపిస్తూ వుంటాడు. అంతులేని ఆకాశములో అనంతముగా ప్రకాశించే సూర్యుడు ఒక్కడే.

ప్రతిక్షణము యీ జగత్తునందు కొన్ని విధములైన కర్మలు సలుపుతూనే వున్నాయి. పుణ్యములు, పురుషార్థములు, చావులు పుట్టుకలు, పెండ్లిండ్లు పేరంటములు యివి నిర్విరామముగా జరుగుతూ జీవితము నవ్వులతో యేడ్పులతో ముగిసిపోతూ వుంటుండాది. దీనికి అంతమే లేదు. మానవుడు పుట్టగనే ఆకలి అతనిని వెంటాడుతుంది. నాభినాళమును మనము త్రుంచగనే కెవ్వు కెవ్వుమని యేడుస్తుంది. ఏ తేనో, గ్లూకోజో, పాలో నాలుకకు రాసినప్పుడు ఆ ఏడుపు చల్లారుతుంది. మొట్టమొదట మానవుని యేడిపించేటువంటిది ఆకలి. ఈ ఆకలికి ధాన్యము అత్యవసరము. ఈ ధాన్యము కేవలము నీటి ద్వారానే మనకు లభ్యమవుతుంది గాని మరొక మార్గములో మనకు లభ్యము కాదు. ఎన్ని యంత్రములు, ఎన్ని తంత్రములు కనిపెట్టినప్పటికిని ఆకలి తీర్చునది అన్నమేగాని యంత్రములు తంత్రములు గాదు. భూమి నీరుని త్రాగి మానవులకు ధాన్యము నందిస్తుంది. ఈ విధముగా ఆహార విహారములు అభివృద్ధి కాగానే మానవుల యొక్క జనాభా దిన దినమునకు పెరుగుతూ వచ్చింది. దీని తరువాత పాడిపంటలు, గుడిసెలు, యిండ్లు, పల్లెలు, పట్టణములు పెరుగుతూ వచ్చాయి. ఈ విధముగనే మానవ జీవితము దినదినాభివృద్ధి నొందుతూ తమ జీవితమునకు అవసరమైన

దానిని చక్కగా అర్థము చేసుకుంటూ వచ్చింది.

తమ నిత్యజీవితమునకు అవసరమైనవాటిని త్రోగు చేసుకుంటూ వచ్చింది. కొన్ని రహస్యములను కూడను గుర్తించుకుంటూ వచ్చింది మానవత్వము. ఇంతే కాక తమకు తెలియనివి అనేకముగా వున్నవని కూడను గుర్తించుకుంటూ వచ్చింది. మనము తెలుసుకున్నది తక్కువ తెలుసుకొనవలసినది యెక్కువ అని కూడను అర్థము చేసుకొంది మానవత్వము. మానవుడు భూమిని చేయలేడు. మానవుడు నీటిని సృష్టించలేడు. కొమ్మను కొమ్మకు రాపిడి జరిగినప్పుడు అగ్ని కలుగుచున్నదే గాని కొమ్మలో అగ్నిని పెట్టి నిలబెట్టలేడు. ఇది మానవుని చేతకాని పని. కొమ్మలో అగ్ని వుందిగాని ఆ అగ్ని కొమ్మను కాల్చకుండా కాపాడుకుంటున్నది. ఆపనిని మానవుడు చేయలేడు. కనుక యీవిధముగా మన కంటికి కనుపించక, చెవులకు వినిపించక, మనస్సుకు అనిపించక యేదో ఒక విధమైన శక్తి అంతర్లీనమై వున్నది అని కొంతవరకు గుర్తించుకుంటూ వచ్చాడు మానవుడు. అది మానవాతీతమైన శక్తిగా వుండవచ్చును అని వుపాసిస్తూ వచ్చాడు. ఏ శక్తి కైనా ప్రత్యక్ష ప్రమాణము అత్యవసరము. ఈ ప్రత్యక్ష ప్రమాణమునకు యేది మనకు సరియైన సాక్ష్యము అని కూడను విచారిస్తూ వచ్చారు. ఇది మనకు ప్రత్యక్ష ప్రమాణము సూర్యుడేయని విశ్వసిస్తూ వచ్చారు. సూర్యుడే లేకపోయిన వెలుతురు లేదు. కేవలము వెలుతురు మాత్రమే కాదు, యేవిధమైన సృష్టి కూడను స్తంభించి పోతుంది. ఈ ప్రపంచమునందు యే వృక్షములు అభివృద్ధి కావలెనన్నను, ఏ పంటలు పండవలెనన్నను, ఏ జీవి పెరగవలెనన్నను వాటన్నిటికి హైడ్రోజను అత్యవసరము. ఈ సూర్యుని యొక్క ప్రధానమైన శక్తి హైడ్రోజన్, హీలియం. ఈ హైడ్రోజను, హీలియంలు రెండూ లేకుండా పోతే అసలు జగత్తే లేదు. కనుక ప్రత్యక్ష ప్రమాణము మనకు సూర్యుడేయని విశ్వసించుచున్నారు. ఈ సూర్యతత్వమునందు అనేక విధములైన కొన్ని రహస్యములు గుర్తించుకుంటూ వచ్చారు.

క్రమక్రమేణా గాయత్రీ మంత్రమందు సూర్యుని ప్రధానమైన దేవతగా విశ్వసిస్తూ వచ్చారు. ధియో యోనః ప్రచోదయాత్. సూర్యుడు ప్రకాశించినట్లుగా మానవుని యొక్క బుద్ధి కూడను అమితంగా ప్రకాశించాలి. సూర్యప్రకాశము మన బుద్ధిలో ప్రవేశించాలనే ప్రార్థనలు సల్పుతూ వచ్చారు. కనుక ప్రత్యక్ష ప్రమాణమునకు సూర్యుడే ఆధారము. ఈ సూర్యఆధారమును పురస్కరించుకొని గాయత్రీ మంత్రమును వుచ్చరించుకుంటూ గాయత్రి వేదమాత అని కూడను విశ్వసించుకుంటూ వచ్చారు. ఈ గాయత్రి కేవలము ఒక కాలమునకు ఒక దేశమునకు ఒక పాత్రకు సంబంధించినది కాదనియు, భూర్భువసువః మూడు కాలములకు సంబంధించినదని కూడను విశ్వసించారు. తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్. చీకటిని రూపుమాపేది వెలుగు. వెలుగు లేకుండా చీకటి యేమాత్రము మనకు దూరము కాదు. ఈ చీకటిని

321059103

రూపు మాపే సూర్యుడు యీ గాయత్రీ రూపములో ప్రధానస్థానమును ఆక్రమించాడు.

ఈ విధముగా యెడా ఒక శక్తి వున్నదనియు, ఆ శక్తియే దైవమని కూడను విశ్వసించుకుంటూ వచ్చారు. క్రమక్రమేణా అంకెలను కొంతవరకు నేర్చుకోటానికి ప్రయత్నిస్తూ వచ్చారు. ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది తొమ్మిది, పది. ఈ పది అంకెల లోపల ఒకటే ప్రధానముగాని మిగిలినవన్నీ కూడను దానికి భిన్నస్వరూపములే. రెండు అనే నెంబరు వున్నదంటే రెండు ఒకట్లు చేరటం వలనే రెండు అయిపోయింది. తొమ్మిది అనే అంకె వున్నదంటే యిక్కడ తొమ్మిది ఒకట్లు యిందులో చేరటం సంభవిస్తుంది. మిగిలిన నెంబర్లన్నీ ఒకటికి రూపాంతరములే. అనే సత్యాన్ని గుర్తించారు. కనుక ఒక్కటే వున్నది ప్రధానముగా. ఏకం సత్ విప్రా బహుధా వదంతి. ఉన్నది ఒక్కటే అయినప్పటికిని వ్యక్తులు అనేక నంబర్సుగా భావిస్తూ వస్తున్నారు. అనే సత్యాన్ని గుర్తిస్తూ వచ్చారు. దీనినే వేదమునందు ఏకోహం బహుస్యాం, వున్నది ఒక్కటే అనేక లక్షలు మిలియన్లుగా మారిపోతుంటున్నది. ఒకటి లేక రెండుగాని, పదిగాని, మిలియన్లుగాని కావటానికి వీలుకాదు. కనుక యీ నెంబర్లద్వారా దైవమును కూడను ఒక్కటే అనే సత్యానికి వచ్చారు మానవులు. ప్రపంచములో మనకు అతీతమైన శక్తి ఒకటి వున్నదనియు ఆ శక్తి ఒకటేగాని రెండు కాదని కూడను విశ్వసించుకుంటూ వచ్చారు మానవులు. ఆ ఒక్కటే అనేక రూపములు ధరించి అనేక రూపనామముల చేత జగత్తును వ్యాపించి వుంటున్నది.

ఈ సత్యాన్ని పురస్కరించుకొనే ఈశావాస్యమిదం జగత్ అని చెబుతూ వచ్చింది. దీనినే ఆనాటి ప్రజలు ఆదిత్యుని అని పిలుస్తూ వచ్చారు. ఆదిత్యుని అనగా ద్వాదశాదిత్యులలో ఒకడు ఆదిత్యుడు అతనే విష్ణువు అని. విష్ణువు అనగా కేవలము శంఖ చక్ర గదా పద్మములతో కూడినవాడు కాదు. విష్ణువు సర్వవ్యాపకమైన తత్వము. ఇలాంటి విష్ణుత్వానికి మనము ఒక రూపాన్ని కల్పించుకుంటూ వచ్చాము. నిజముగా విష్ణుత్వమనగా సర్వవ్యాపకత్వమే. ఏ విధముగా మనము ఒకటిగా విశ్వసిస్తూ వచ్చాము ఆదిత్యుని? రజిత పాత్రలు వుంటాయి, సువర్ణపాత్రలు వుంటాయి, బ్రాస్ పాత్రలు వుంటాయి, కాపర్ పాత్రలుంటాయి, మట్టి పాత్రలంటా వుంటాయి, ఇవన్నియు నీటిలో నింపినప్పుడు అన్నింటి యందు కూడను సూర్యుడు ప్రతిబింబిస్తూ వున్నాడు. పాత్రలు వేరుగాని, పాత్రల విలువలు వేరుగాని, అన్నింటి యందు సమానంగా ప్రతిబింబిస్తున్నాడు సూర్యుడు. కొన్ని వేలపాత్రలు పెట్టినప్పటికిని కొన్ని వేల సూర్యులుగా కనుపిస్తూ వుంటాడు. పాత్రలు వేలకు వుంటున్నవి గాని సూర్యులు వేలకాలేరు. సూర్యుడు ఒక్కడే. అనే సత్యాన్ని అర్థము చేసుకుంటూ వచ్చారు. ఈ పాత్రల విలువలు, రూపములు, నామములు వేరువేరుగా వుండవచ్చు. దీనిని ఆధారము చేసుకొని దేహములనే పాత్రలుగా విశ్వసించుకుంటూ వచ్చారు.

ఈ దేహము మృణ్మయమైన దేహము. ఈ మృణ్మయ పాత్రయందు చిన్మయమైన దైవత్వము వున్నది అనే సత్యాన్ని గుర్తిస్తూ వచ్చారు. ఇతనినే హిరణ్యగర్భుడు అని పేరు పెడుతూ వచ్చారు. కనుక యీ విధంగా ప్రప్రథమము నుండి మానవుడు కొద్ది కొద్దిగా అభివృద్ధి గాంచుకుంటూ కట్టకడపటికి యేకత్వాన్ని గుర్తించుకునే దివ్యత్వాన్ని సంపాదించుకుంటూ వచ్చాడు మానవుడు. ఇతనికి మరొక పేరు కూడను సృష్టించుకుంటూ వచ్చారు. ఈశ్వరః అన్నారు. అనగా నిఖిలైశ్వర్యము కలవాడు. ఏమిటి యీ బలము. ధనము ఒక ధనమే. ఆరోగ్యము ఒక విధమైన ధనమే. విద్య ఒక ధనమే. గుణము ఒక ధనమే. తెలివి ఒక ధనమే. సర్వము ధనముల క్రిందనే పోల్చుకుంటూ వచ్చారు. ఇవన్నీ కూడను ఒక విధమైన ధనములే. సకలైశ్వర్య స్వరూపుడు ఈశ్వరుడు అనే సత్యానికి దిగారు. సకలైశ్వర్య స్వరూపుడు ఈశ్వరుడు

తరువాత యిందులో వున్న రహస్యాన్ని గుర్తించి శివః అని పిలుస్తూ వచ్చారు. శివః అనగా త్రైగుణ్యరహితుడని అర్థము. సత్వ రజో తమో గుణములకు అతీతమైనవాడు. గుణములు లేనివాడు కనుక యితను శుద్ధసత్వుడు అని యీ పిలుచుకుంటూ వచ్చారు. ఆ శుద్ధసత్వుడే శివుడు. అదే మంగళకరమైన తత్వము. గుణములు లేనప్పుడే మంగళత్వము యేర్పడుతుంది. గుణములు వుండినప్పుడే అమంగళము యేర్పడుతుంది. కనుక శివః అనగా మంగళ స్వరూపుడు. క్రమక్రమేణా యింకా వున్నత స్థాయికి వెడుతూ వచ్చాడు మానవుడు. సంభవః నాల్గవ పేరు పెడుతూ వచ్చారు. సంభవ అంటే ఏమిటి? తన యిష్టప్రకారము ఏ నియమములు లేకుండా, ఎప్పుడు అవసరమో, ఎక్కడ అవసరమో, ఏ కాలములో అవసరమో, అప్పుడంతా తాను వుద్భవించే భావము కలవాడిని సంభవః అన్నారు. అందువల్లనే భగవద్గీతలో కూడను

యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థానమ ధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్.
పరిత్రాణాయ సాధూనాం వినాయశ దుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే.

ఎక్కడెక్కడ అవసరమో అక్కడక్కడంతా తాను వుద్భవిస్తూ వుంటాడు. అలాంటి స్వాతంత్ర్యము కలవాడు కనుకనే అతనికి సంభవః అని పేరు పెట్టారు. కనుక యీ విధముగా ఒక్కొక్క అంతరార్థమును పురస్కరించుకొని పేర్లు పెడుతూ వచ్చారు. ఈశ మరొక పేరు పెట్టారు.

ఈశ గిరీశ నరేశ పరేశ సురేశ శేషభూషణా ప్రభో
సాంబసదాశివ శంభో శంకర శరణం మే తవచరణయుగళం

ఈ మానవుని యొక్క తెలివి తేటలు ఎంత ఘనమైనవిగా అభివృద్ధి పొందుతూ వచ్చి
యా ఆనాటి ఋషుల యొక్క తత్త్వము చక్కగా గుర్తించుకోటానికి ప్రయత్నించాలి.
ఈశ అనగా యేమంటే ఐశ్వర్యము, ధనము, కీర్తి, యశస్సు, జ్ఞానము, వైరాగ్యము.
షడైశ్వర్య స్వరూపుడే ఈశుడు అన్నారం. ఈ షడైశ్వర్య స్వరూపుడు ఈశ్వరుడు
అనే తత్త్వానికి ఈశ అని పేరు పెట్టుకుంటూ వచ్చారు.

తదుపరి మానవుని యొక్క మనస్సు, తెలివితేటలు దినదినాభి
వృద్ధి పొందుతూ వచ్చాయి. కట్టకడపటికి అప్రమేయుని అన్నారు. అప్రమేయుడు
అనగా ఏమిటి? ఎట్టి ప్రమాణములకు చిక్కని వాడు. సముద్రాన్ని తీసుకు పెళ్లి
ఒక డొప్పుతో మనము కొలవ వచ్చు. ఇంక ఆకాశమంను కూడను కొలవ వచ్చు. కాని
భగవంతుని కొలచటానికి యేమాత్రము కొలతబద్దలేదు. ప్రత్యక్షప్రమాణము, అను
మానప్రమాణము, శబ్దప్రమాణము మూడు ప్రమాణములకు అతీతమైనట్టివాడు
భగవంతుడు. ఈ మూడు ప్రమాణములకు అతీతమైనవాడు కనుకనే అతనిని
అప్రమేయుడు అన్నారు. అట్టి అప్రమేయుడైన భగవంతుడు సర్వత్ర వ్యాపించి వుం
టున్నాడు. ఇలాంటి భగవత్ తత్త్వమనేది లేకపోతే యీ జగత్తనేది లేదు. మాన
వుడు విశ్వసించినా విశ్వసించకపోయినా యీ దివ్యమైన శక్తి సర్వత్రా వ్యాపించి ప్రకాశి
స్తూనే వుంటున్నాది. ఇలాంటి భగవంతుని ప్రత్యక్షంగా గుర్తించాలని అనేకమంది
ఋషులు తపస్సు చేస్తూ వచ్చారు. మన జీవితము యొక్క పరమావధి ఆధారమైన
దివ్యత్వమును గుర్తించటమే పరమ లక్ష్యమని సత్తిస్తూ వచ్చారు.

కొంతమంది ప్రయత్నము చేస్తూ చేస్తూ అలసిపోయి ఇది మ
నకు చేతగాని పని అని విరమించుకున్నారు కొంతమంది. మరికొంతమంది
ప్రారంభము లోపలనే మానవత్వమం ఎక్కడ దైవత్వము ఎక్కడ దీనికి దానికి
ఎట్టి సంబంధము లేదు కనుక ఇలాంటి దానికి అతీతమైన దానిని గుర్తించు
కోటం అసాధ్యమని ప్రారంభములోనే విరమించుకున్నారు. కాదు. కాదు. ఆ దివ్య
త్వము నుండి వచ్చినటువంటిదే యీ పవిత్రమైన మానవ జీవితము. 'మమైవాంశో
జీవలోకే జీవభూతస్సనాతనః'. ఆ దివ్యమైన అంశమే మానవత్వము. తండ్రిని కు
మారుడు గుర్తించుకోటం అత్యవసరము. కనుక దీనికి ఎన్ని యిబ్బందులు కలిగి
నప్పటికి, ఎన్ని విధములైన ఆటంకములు సంభవించినప్పటికి వదలకూడదని
దీక్షను బట్టి సాధిస్తూ వచ్చారు కొంతమంది ఋషులు. కట్టకడపటికి ఆ ది
వ్యమైన శక్తి వల్ల వారు గుర్తించుకోగలిగారు. ఆ గుర్తించుకున్న ఋషులు తమ
యందు మాత్రమే ఇముడ్చుకొనక జగత్తునకు చాటుతూ వచ్చారు. "ఉత్తిష్ఠత
జాగ్రత ప్రాప్య వరాన్నిబోధత'. ఓ అజ్ఞాన మనే నిద్రలో నివసించే మానవులారా!

మేలుకోండి, మేలుకోండి. ఈ దివ్యమైన తేజస్సును మీరు చూడండి అన్నారు. మేము చూచాము. ఎక్కడ చూచాము లోపల వెలుపల సర్వత్రా చూచాము. "అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణస్థితః". ఎక్కడ వున్నాడు తెలుసునా. "వేదాహమేతం పురుషం మహాన్తము ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్" అన్నారు. ఏ విధంగా ఆయొక్క పురుషుని వర్ణించటం వీలుకాదు. సూర్యుని తేజస్సువలె ప్రకాశిస్తున్నాడు. అతను ఎక్కడ వున్నాడు తమస్సుకు ఆవల వున్నాడు. తమస్సు వదులు పోగాని ఆతప శ్శక్తి చేరదు ఈ తేజస్సు మనకు ప్రాప్తించదు అని చాటుతూ వచ్చారు. తమస్సును దూరం చేయాలి.

తామసంబు విడక తత్వంబు ఎటు కుదురు
రాజసంబు విడక రాదు భక్తి.
సాత్వికంబె దివ్య సాధనం బగునయా
మరువబోకు ఓట్టి మంచిమాట.

మొట్టమొదట మనలో వున్న తామసమును మనము దూరము చెయ్యాలి. కేవలము తిండి తీర్థాదులకై వచ్చినదా ఈ కాయము? కాదు. కేవలము ఆహార నిద్రా భయ మైథునాదులలో వుండేది పశుత్వము. దీనికి అతీతమైన గుణము మరొకటి వుంటుంటాది. అదే discrimination power. దివ్యమైన శక్తి జ్ఞానం. తమస్సు పోకుండా పవిత్రమైన జ్ఞానం మనకు లభ్యం కాదు. ఆ తమస్సు పోయిన తరువాత రాజసికము వుంటాది. రాజసిక మనేది అనేక కోరికలతో నింపుకుంటూ నింపుకుంటూ వుంటుంటాది. తరువాత ఈ రాజసికమును కూడను మనము దూరము చెయ్యాలి. అప్పుడే సాత్విక మనసు ఆవిర్భవిస్తుంది. ఈ సాత్వికము ఆవిర్భవించినప్పుడే ఈ తేజోమయమైన దివ్యత్వము మనకు కనుపిస్తుంది.

విద్యార్థులారా! వేదము యొక్క రహస్యము మహా అగాధమైనటువంటిది. శ్రద్ధా భక్తులు కలిగిన వారికి ఇది చాలా సులభమార్గమే. కన్నులు తెరిచిన వానికి లక్షల మైళ్ళలో వున్న నక్షత్రాలంతా కనుపిస్తాయి. కాని కన్నులు మూసుకున్న వానికి, లేక కన్నులు లేనటువంటి వానికి, powerful bulb పెట్టి కంటిముందు పెట్టినా కనుపించదు. కోటి సూర్యుల కాంతితో వెలుగుతున్న సూర్యునైనా మనము అణుమాత్రమైనా చూడలేము. కనుక మన శ్రద్ధ, భక్తి అనే నేత్రమును విప్పాలి. కనుక ఈ చర్మ చక్షువు కాదు జ్ఞాన చక్షువు, దానిని మనము తెరచినప్పుడు దివ్యత్వమైన ప్రకాశము సర్వత్రా గోచరిస్తుంది. దైవమెక్కడ వున్నాడు? పిల్లలు నిత్యము భోజనము చేసే టైము తో[illegible]ల ప్రార్థిస్తూ వుంటున్నారు. కాని అర్థము చేసుకొని ప్రార్థన సల్పటం లేదు. బ్రహ్మార్పణం అంటున్నాము. ఎవరికి అర్పణము చేస్తున్నాము? జఠరాగ్నికి కాదు. కాని చెప్తున్నాం.

బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతం
బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మ కర్మ సమాధినా

అంతా బ్రహ్మకు అర్పితం చేస్తున్నామంటాడు. బ్రహ్మ ఎక్కడున్నాడు? ఎక్కడ బ్రహ్మ అని మనము విచారణ చేసినప్పుడు

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్.

ఓ పిచ్చివాడా! నేను నీయందే వుంటున్నాను. నేను వైశ్వానర రూపములో నీయందే వుంటున్నాను అని జవాబు యిస్తున్నాడు. నేను జఠరాగ్నిలో లేకపోతే నీవు తిన్నది ఏ గతి పడుతుంది. అజీర్ణ వ్యాధితో మరణిస్తావు. నీవు తినే నాలుగు రకములైన భోజనాన్ని నేను జీర్ణింప చేస్తున్నాను. కనుక సందేహమునకు అవకాశము లేదు. ఇంకా సందేహపడినావా, అట్టి సందేహపడిన వానికి సమాధానము చెప్పేవారు లేరు. చక్కగా నిద్రించే వానిని రెండు మూడు పర్యాయములు తట్టి లేప వచ్చు, లేక నిద్ర లేకుండా కన్నులు మూసుకున్న వానిని పిల్చి మనము ఒక్క క్షణములో లేపవచ్చు కానీ నిద్ర లేక నిద్ర నటించే వానిని ఏమాత్రము ఎవరు లేపలేరు. ఇదే చెప్పారు గోపికలు.

మేను మరచి నిద్రించే వారిని మేలుకొలుప గలరెవరైనా
కనులు మూసుకొని నిదుర నటించే ఘనుని లేపగా ఎవరి తరము
జోలమేలోయి ఊయలలూచాలోయి . . .

క్రిష్ణా నీవు కేవలం నిద్రించటం లేదు. కేవలము నీవు మేలుకొనటం లేదు. మేలుకొని నిద్రించే వానివలె నటిస్తూ వుంటున్నావు. అలాంటి నిన్ను లేపటం వీలవుతుందా. అసాధ్యము. ఇంక ఊయలలు చాలించమన్నారు గోపికలు.

భగవంతునికి నిద్ర అనేది లేదు. భగవంతుడు నిద్రిస్తే, లోకమంతా చక్కగా నిద్ర పోతుంది. భగవంతునికి మేలుకొలుపు లేదు. ఎప్పుడు మేలుకొలుపు? నిద్ర వస్తే కదా మేలుకొలుపు. నిద్రయే లేని వానికి మేలుకొలుపు ఎందుకు? నిద్ర మేలుకొలుపు మానవునకు మాత్రమే. రాత్రింబవలనే బాధము కలిగిన వానికి మాత్రమే నిద్ర మేలుకొలుపు. నిజముగా చూస్తే పగలు రాత్రి అనే టువంటిది లేదు. మానవుడు వుండిన ప్రదేశమును పురస్కరించుకొని, తన కాలమును పురస్కరించుకొని రాత్రింబవలు జరుగుతూ వున్నాయి. భూమధ్య రేఖ పైకి సూర్యుడు వచ్చినప్పుడు పగలంటున్నాము. భూమధ్యరేఖకు క్రిందికి పోయినప్పుడు రాత్రి అంటున్నాము. కనుక సామాన్యమైన జగత్తునందు ప్రకృతమైన జీవితమునకే రాత్రింబవలు లేవు. దీనికి east, west, north, south అనేవి లేవు. కేవలము

మనము వున్న స్థానమును పురస్కరించుకొని సూర్యోదయము సర్త పురస్కరించుకొని యిది తూర్పు యిది పడమర అని నిర్ణయించుకుంటున్నాము. సైంటిస్టులు ఏతా east, west, north, south అనిగాని సూర్యోదయ సూర్యాస్తమయములని గాని లేనే లేవు. అంటున్నారు. అంటున్నారేగాని నిత్యజీవితములో వారు వదలుతున్నారా? Good Morning Sir అంటారు.. morning ఎక్కడనుండి వచ్చింది. ఎందుకు morning వుపయోగపెట్టాలి. కనుక యీ దివ్యమైన జీవితములోపల యేది వాదనుకుంటున్నామో దాన్ని వుపయోగించక తప్పదు. ఆధ్యాత్మిక మార్గములో పోయినప్పుడు అంతా సమత్వమే. ప్రాకృతమైన స్థితిలో వుండినంత వరకు మనము ప్రాకృతమునే అనుసరిస్తూ వుండాలి. ఎంతవరకు? నేను, నీవు, అతను యీ ముగ్గురు వుండినంత వరకు యీ ప్రాకృతము. ఇక్కడం మూడు తత్వములు తలస్తున్నాము. I You and He. ఈ మూడు తత్వములను మనము పూర్తి మరచిపోవాలి. అదే దివ్యమైన ఆత్మ తత్వము. తన, పర అనే భేదమును విసర్జించాలి. ఇలా ఇది అంత సులభమైనది కాదు. ప్రయత్నం చేస్తే ఎంతైనా మనము సాధించవచ్చును. కానీ మానవుడు శ్రద్ధా భక్తి పూర్వకంగా దీనికి సాధనలు సల్పటం లేదు. కనుక మానవుడు ఒక పశువువలె మొట్టమొదట సృష్టియై ఆహార నిద్రా భయ మైథునాదులతో క్రమక్రమేణా పెరిగి విచారణా శక్తి కలిగి, విశ్వాసాన్ని సృష్టించుకొని అనుకూలమైన సమయాలను పురస్కరించుకొని, క్రమక్రమేణా భోగభాగ్యములను అనుభవించే రీతులను కూడను కనిపెడుతూ వచ్చారు.

అన్నీ కనిపెట్టాడుగాని మానవుడు కట్టకడపటికి జనన మరణాములకు కారణం ఏమిటి అనే విషయాన్ని కనిపెట్టటానికి వారు వెనుకంజ వేశారు. దాని రహస్యము ఏమిటి? "జాతస్య మరణం ధ్రువమ్". పుట్టినవాడు చావక తప్పదు. కాని చచ్చినవాడు పుడతాడో లేదో మనకు తెలియదు. ఈ రెండింటి యొక్క రహస్యమేమిటని దాన్ని కూడా తెలుసుకోటానికి ప్రయత్నం చేశారు మహర్షులు. ఇది కేవలము మానవాతీతమైనది అన్నారు. ఇది భగవత్సంకల్పముచేత జరిగేటువంటిదిగాని అన్యమానవుల ప్రయత్నముతో జరిగేది కాదనుకున్నారు. జీవించాలనుకుంటే ఎంతకాలమైనా జీవించగలుగుతున్నాడా? నాకేమి రోగము లేదు. నేను చక్కగా ఆరోగ్యముగా వుంటున్నాను. ఇంకా ఒక పది సంవత్సరములు వుండగలను అని అనుకోవచ్చు. రాత్రి పోతుంటే కారు ఏక్సిడెంటై చచ్చిపోవచ్చు. దీనికి ఆరోగ్యమా ముఖ్యము! మరణమునకు ఏది కారణము? మన ఆరోగ్యము కాదు. మనశక్తి సామర్థ్యములుగాదు.

321059109

ధనకనక వస్తువాహనాదులు కాదు. కానేకాదు. దైవానుగ్రహము దీనికి మూలకారణము. మానవుని ప్రయత్నం లేకుండా అనేకంగా జరుగుతున్నాయి. మానవునిగుండె కొట్టుకోటానికి మానవుడు యే ప్రయత్నం చేస్తున్నాడు? మానవుడు ఉచ్ఛ్వాస నిశ్వాసములు వదలటానికి యే ప్రయత్నం చేస్తున్నాడు? మానవుని యొక్క దేహము లోపల blood circulation జరగటానికి యే ప్రయత్నం చేస్తున్నాడు? ఇవంతా ప్రయత్నంలో జరిగేవి కాదు. ఇవి కేవలము దైవసంకల్పములో జరిగేటువంటివి. కనుక దైవ సంకల్పమునకు మించినది మరొకటి లేదని నిర్ణయము చేసుకున్నారు. ఓ మానవుడా!

శతవర్షములదాక మితము చెప్పిరిగాని
నమ్మరాదా మాట నెమ్మనమున
బాల్యమందో లేక ప్రాయమందో లేక
ముదిమియందో లేక ముసలియందో
ఊరనో అడవినో ఉదకమధ్యంబునో
ఎప్పుడో విడిచేది ఎరుకలేదు.
ప్రాణమున్నంతలో తన్ను తెలియవలయు

మనము తెలుసుకోవలసింది మన ప్రాణము వున్నంతలోనే భగవంతుని తెలుసుకోవాలి. ఎప్పుడో ఏమో అనే విషయాన్ని నీవు యేమాత్రం పోస్టుపోన్ చేయవద్దు. దీన్ని cancel చేయటానికి ఎవరికి వీలుకాదు. ఇది కేవలము దైవానుగ్రహములో జరిగేటువంటిది. కనుక దైవాన్ని ప్రార్థించమని బోధిస్తూ వచ్చారు మహాత్ములు. ఈ ప్రాణము ఎక్కడ వుంటున్నది? 'నీలతోయద మధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వర' -- వెనక వైపున మనకు 33 రింగులతో కూడిన spinal chord వుంటున్నది. దానిలో between 9 and 12 సుషుమ్నానాడి అని వుంటున్నది. అదే విద్యుల్లేఖ వలె కదులుతున్నది. ఆ త్రైటెనింగ్ గా కొట్టినప్పుడే దేహమంతా function చేస్తున్నది. కొంతమంది మన ప్రాణమంతా heart లో వుంటుందాది అంటారు. heart అనేది కేవలం main switch. కాని ప్రాణమక్కడ లేదు. heart ను తీసి యింకొక heart ను మార్చి డాక్టర్లు ఏమేమో చేస్తున్నారే అప్పుడ పైపోయింది యీ ప్రాణము. కేవలము main switch ని మారుస్తారు. కాని అక్కడ spinal coulmn లో దాని ప్రభావము చేతనే heart పని చేస్తున్నది.

ఆనాటి వేదపురుషులంతా యేమి తెలియని మూర్ఖులుగాను

వారికి ఏమాత్రము జ్ఞానము లేని వారుగాను, సైన్సు తెలియని అమాయకులుగాను, భావిస్తూ వస్తున్నారు. ఈనాటి సైన్సులో తెలిసిన దానికంటె మరింత అధికముగానే తెలిసినవారు వారు. ఆనాటి సైంటిస్టు మహాగొప్పవాడు. ఎవరు? హిరణ్య కశిపుడు. పంచభూతములు హస్తగతము చేసుకున్నాడు. ఆసైంటిస్టు పొందిన దాంట్లో వేయింట ఒక భాగము కూడా యీనాటి సైంటిస్టు పొందలేదు. ఇంత తెలుసుకున్నవాడు, సముద్రము అడుగు భాగమున కూడా సంచరిస్తూ వచ్చాడు. భూమినంతా శోధిస్తూ వచ్చాడు. గగన మార్గములో సంచరిస్తూ వచ్చాడు. ప్రతి అణువునందు పరిశోధనలు సలుపుతూ వచ్చాడు. పంచభూతములను తన హస్తగతము చేసుకున్నాడు, కాని అంత తెలుసుకున్నప్పటికి తనను తాను తెలుసుకోలేకపోయాడు. కనుకనే ఆనాటి మహర్షుల తత్త్వము యీ విధంగా compare చేసుకోటానికి వీలుకాదు. ఒక్కొక్క మహర్షి కూడను ఏ విధమైన తపస్సునాచరించి ఎంతటి దివ్యమైన శక్తిని సాధిస్తూ వచ్చారు. ఆనాటి doctors అందరూ operations జరుపుతూ వచ్చారు. ఎన్నిరకములైన ట్రైనింగులు పొందో, ఎన్నిరకములైన దేశములన్నూ వెళ్లో, ఎన్ని ప్రాణములు తీసో యీనాటికి వారు పెద్ద పెద్ద డాక్టర్లుగా తయారౌతున్నారు. ఎన్నిరకమైన instruments నో తీసుకుంటూ వచ్చారు. కాని ఆనాటి వైద్యములో శస్త్ర చికిత్స లోపల మహా ప్రవీణుడైనవాడు భారద్వాజ మహర్షి. భారద్వాజ మహర్షి శస్త్రచికిత్సను చక్కగా చాలా సులభంగా ప్రపంచమునకందిస్తూ వచ్చాడు. ఇదియే ప్రకృతి చికిత్స. ఆయుర్వేదమని చెప్పుకుంటూ వచ్చారు. అనగా ఏమిటి? ఆయుః + వేదము ఆయుర్వేదమని. ఆయువునందించే వేదము యిది ఆయుర్వేదము. ఐతే యిది మనకు quick గా పని చేయుటం లేదని మనం కొంత వరకు తొందర పడుతున్నాం. మనకు ఎప్పుడు ప్రతి దానికి quick results రావాలి. quick results అనేదాంట్లో quick అనే దానికి విరుద్ధంగా వుంటుంది, ఈనాడు యాంటీబయోటిక్సు మాత్రలు వచ్చేసినాయి. quick results. టెంపరేచరు వచ్చిందంటే రెండు మాత్రలు వేసుకుంటే టెంపరేచరు తగ్గిపోతుంది. కాని తరువాత మరి ఎక్కువ పెరుగుతుంటాది. దాని యొక్క reaction అధికంగా మారుతున్నాయి. కాని ఆనాటి తపఃశక్తి అనే దాంట్లో యీ reaction, reflection, resound యేమాత్రం వుండదు. అది తపశ్శక్తి వల్ల జరిగేటువంటిది. ఎన్నివేలషైళ్లలో వుండి తపస్సు చేస్తున్నప్పటికిని దూరదర్శనము వారికి ప్రాప్తించింది ప్రకృతి లోము భా

ముఖగా సంభాషణ సల్పేటువంటి వారు. ఈనాడు దూరదర్శనమని, దూరశ్రవణమని యంత్రాలు పంపించి కోట్లు ఖర్చుపెట్టి మనము యీనాడు అనుభవిస్తున్నాము ఒక్కనయాపైస ఖర్చులేదు ఆనాడు.. మనస్సు పవిత్రమైన దివ్యత్వముగా మార్చుకోటం చేతనే యింత శక్తులంతా వారికి చేకూరుతూ వచ్చాయి.

విద్యార్థులారా! మానవుడు మొదటి స్థాయినుండి ఎంతవరకు ఎట్లా ఎట్లా పెరుగుతూ వచ్చాడు అనే విషయాన్ని మనం చక్కగా విచారణ చెయ్యాలి. పుట్టిన తక్షణమే ఎవ్వడూ పండితుడు కాడు. విద్వాంసుడు కాదు. క్రమక్రమేణా మన శ్రద్ధా భక్తుల చేతనే మనము యింతటి వున్నతస్థాయికి చేరుతున్నాం. ఒక BA; MA. అనే రెండక్షరాల డిగ్రీకోసము ఎంతో మనం శ్రమ పడుతున్నాం. దివ్యత్వమైన దైవత్వానికి మనం ఎంత శ్రమ పడుతున్నాం? ఆ పవిత్రమైన జ్ఞానము కోసం మనం ఏమి ధారపోస్తున్నాం? ఏమ లేదు. దానికి తగిన కృషి చేయాలి. సాధనవలన పనులు సమకూరు ధరలోన. మనకు తెలియదు తెలియదని విసర్జించకూడదు. తెలియని దానినే మనము సాధించటానికి ప్రయత్నించాలి. అదే ఆనాటి మహర్షులు చేసినసాధన. వారు తెలియని దానిని సాధించాలి సాధించాలని అనేక విధములైన కష్టములకు, నష్టములకు, దుఃఖములకు, వానలకు, ఎండలకు అన్నివిధముల సహించి భరించి దానిని తెల్సుకొని నెల్సుకొని సాధిస్తూ వచ్చారు. ఈనాడు మనము యే ప్రయత్నము చేసినాగాని మొట్టమొదట మనము సుఖముగా వుంటుండే ప్రయత్నం జరగాలి. కించిత్తు కష్టం మనకు అడ్డురాకూడదు. సుఖవంతుడు యే ఒక్కదానిని సాధించలేడు. సాధించాలని శ్రద్ధ గలిగినవాడు సుఖమును కోరటానికి వీలు లేదు. సర్వము త్యాగము చేసి దైవానికి మనము అర్పితమంగావాలి. అప్పుడే మనకు అతీతమైన విద్యలు అన్ని ప్రాప్తిస్తాయి.. ఎన్ని విద్యలు అభ్యసించినప్పటికిని, ఎన్ని శక్తులు సాధించినప్పటికి, ఆనాటి మహర్షులయందు కించిత్తైనా అహంకారము ఎక్కడా కనుపించేటువంటిది కాదు. ఈనాటి సైంటిస్టులందుగాని, పరిశోధకులయందుగాని, శాస్త్రజ్ఞులయందుగాని కించిత్ మాత్రము సాధించారంటే వానిని పట్టటానికి వీలు లేదు. ఈ అహంకారముతో తలకిందును ఎగిరి పడుతుంటాడి. నిజముగా విద్వాంసునికి అహంకారము వుండటానికి వీలు లేదు. కనుక విద్యార్థుల యందు అహంకారము యేమాత్రము విజృంభించరాదు. వినయమే విద్యయొక్క ప్రధాన లక్షణము అన్నారు. ఈనాడు సైన్సు సాధించింది ఏమిటి? ఏమాత్రము మనము సాధించలేదింకా. ఏదో మన బుద్ధుల యొక్క కొలతలు పురస్కరించుకొని గొప్పగా సాధించామని అనుకుంటున్నాము. సూర్యునిలో వుండిన [illegible]

మూడు వేల భాగములో రెండింటిని మాత్రమే సైంటిస్టులు అనుభవిస్తున్నారు ప్ర
పంచమంతా చేరి, 2998 యింకా అట్లేవుంది. రెండు మాత్రమే అనుభవిస్తు
న్నాము, యింకా ఈ రెండింటిలోనే యింత శక్తి ప్రపంచమునందు వ్యాపించి
వుండినప్పుడు యింక మూడు వేల energyని ఉపయోగిస్తే ప్రపంచము ఎంత
దేదీప్య మానముగా వెలిగేటువంటిదో? కనుక దైవము యొక్క అనుగ్రహము ఒక
కిరణము మనకు వచ్చిందంటే ఎంతైనా మనము సాధించవచ్చు. నీ కిరణము
లలో ఒక అణుమాత్రమైనా ప్రసాదించమని కోరుతూ వచ్చేరు ఆనాటి మహర్షు
లు. దైవము యొక్క శక్తి కించిత్తు మనము సాధిస్తే అనంతమైన దానిని మనము
సాధించవచ్చు. దైవానుగ్రహము లేకపోతే ఏమి సాధించటానికి ఎవరికీ వీలు
కాదు. ఎగరటానికి ఇష్టము లేకపోతే గ్రద్ద ఒక యించైనా ముందుకు పోలే
దు. నడవటానికి ప్రయత్నిస్తే చీమైనా కొన్ని మైళ్ళ దూరం పోతుంది. ప్రయత్న
ము అత్యవసరం.

యత్న ప్రయత్నముల్ మానవ ధర్మము,
జయాపజయములు దైవాధీనములు.

కనుక నీవు దైవధ్యానము పైన వెళ్ళు. అన్నీ success. Success begets success
మనము అన్నింటిని సాధించాలంటే, అనుగ్రహాన్ని మనము సాధించాలి.

విద్యార్థులారా! మన వైస్ ఛాన్సలరు యీనాడు చాలా పెద్ద question
వేశాడు. మానవుడు దివ్యత్వాన్ని ఎట్లా చేరాలి? ఏ విధంగా అనుభవించాలి? ఏ విధంగా
సాధించాలి అని. పెద్ద ప్రశ్నగాని దీనికి జవాబులు చెప్పాలనుకుంటే ఒక్క చిటిక
మాత్రములో జవాబులు చెప్పవచ్చు. మనము సాధన చేయనక్కర లేదు. గజేంద్రు
డు కొన్ని వేల సంవత్సరములు మొసలితో పోరాడుతూ వచ్చాడు. దేనితో పోరాడుతూ
వచ్చాడు? తన భుజబలము చేత, తన దేహశక్తి చేత సాధించుకోటానికి తాను
ప్రయత్నం చేశాడు. ఈ అహంకారముతో భుజబలము, బుద్ధిబలము, ధనబల
ము, మేధాబలము వీటితో సాధించినంత కాలము ఏమాత్రము విజయాన్ని సాధించ
లేము. కట్టకడపటికి అలసిపోయాడు

నీవే తప్ప నితఃపరం బెరుగ మన్నింపందగున్ దీనునిన్
రావే ఈశ్వర కావవే వరద సంరక్షింపు భద్రాత్మకా!

ఇంక నాకు ఏమాత్రము చేతకాదు. నీవు తప్ప నాకు అన్యము లేదని శరణాగతి
అయినప్పుడు సంరక్షింప బడ్డాడు. అర్జునుడు కూడను మహాయుద్ధ సమయము
లోపల తన యొక్క తెలివి తేటలనంతా వుపయోగపెట్టి మొదటి అధ్యాయము

రెండవ అధ్యాయము పదకొండవ శ్లోకము వరకు ప్రశ్నల వర్షము కురిపిస్తూ వచ్చాడు. తెలివి తేటలనంతా వుపయోగించుకున్నాడు. ఆ తెలివి తేటలు ఎంతవరకు? కొంత వరకే సరుకు వున్నంతవరకే. ఎంతకాలమునుంచో వుంచుకొన్న ఆ సరుకంతా అయిపోయింది పాపం అర్జునునికి. ఇంక యే మాత్రము మాటలు కూడా లేవు. చేతులు జోడించాడు. కరిష్యే వచనం తవ అన్నాడు. మీ ఆజ్ఞ ప్రకారము చేస్తానన్నాడు.

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు
మామేవైష్యసి యుక్త్వైవం మద్భక్తో మత్పరాయణః.

ఇప్పుడు నీవు ముందుకు పో నేను చూచుకుంటానన్నాడు. కనుక భగవంతునికి అర్పితము చేసినప్పుడే యివన్నీ సులభంగా అర్థమవుతాయి. సులభంగా అన్నింటిని మనము సాధించవచ్చు. ఈనాటి సాధకులుగాని, యీనాటి భక్తులుగాని అర్పణానికి పోవటం లేదు. Shareholder business మాదిరి చేస్తున్నాం మనము. నాది అర్ధం షేరు నీదొక అర్ధం షేరు రెండింటిని కలిపి బిజినెస్ చేద్దాం అంటున్నారు. నేను చేసే పని నేను చేస్తాను నీవు యిచ్చే అనుగ్రహము నీవు యిచ్చేయి. యీరకంగా వ్యాపారము మొదలుపెడతారు. partnership చేసుకుంటారు. ఈ బిజినెస్ యేమాత్రము చెల్లదు. నీకు అర్పితము. అన్నీ తానే చూచుకుంటాడు. కొడైకెనాల్ లో చెప్పాను. స్వామి సన్నిధిలో వుండినంత వరకూ, స్వామి సంభాషణలు వినేంత వరకు, స్వామి వాతావరణములో వుండినంత వరకు పిల్లల హృదయాలు చాలా పవిత్రముగా, చాలా ఆనందముగా వుత్సాహంగా వుంటారు. కానీ యీ వాతావరణము బయటకు పోయిన తక్షణమే యిదంతా మార్పు చెందుతూ వుంటుంది. దీనికి కారణం ఏమిటి? దేహము మృణ్మయము. చిన్న ఉదాహరణము. మట్టి మగ్ వుంటుంటాది. ఆ మట్టి మగ్ లో నీరు పోసి ఎవ్వరూ touch చేయకుండా వుండే ప్రదేశములో పెట్టినప్పుడు రెండు దినముల లోపల మూడు వంతుల నీరు ఖాళీ అయిపోతూ వుంటుంది. ఆ మట్టి పీల్చుకుంటుంది. ఆ మగ్ నిండుకు నీరు పోసి ఆ మగ్ మరల తిరిగి నీటిలో పెడితే లోపల నీరు అణుమాత్రమైనా తగ్గదు. ఈనాడు ఏమై పోతుందంటే విద్యార్థులు మట్టి మగ్ వంటివారు. దీంట్లో ఆధ్యాత్మిక మనేది full గా నింపినప్పటికిని చుట్టూ ఆధ్యాత్మికము లేని వాతావరణము లోనికి పోయినప్పటికి యిదంతా కొంతవరకు తగ్గిపోతుంది. అక్కడకూ పోయి కూడను చుట్టూ ఆధ్యాత్మికమును మనము కల్పించుకుంటే మనలో నేర్చుకున్నది యేమాత్రము తగ్గటానికి వీలుండదు. కనుక యిక్కడ సత్సంగము అక్కడ దుస్సంగము. అక్కడ కూడను సత్సంగములో చేరిపోవాలి. సత్కార్యాలు ఆచరించినప్పుడే మన యొక్క భక్తి యేమాత్రము మారక, చెదరక, కదలక వుంటూ వుంటుంది. కేవలము నోటితో మంత్రము

లు చెప్పినంత మాత్రమున చాలదు. భగవంతుని నామాన్ని వుచ్చరించినంత మాత్రమున చాలదు. భగవత్కార్యములయందు మనము ప్రవేశించాలి.

మీకు అనేక పర్యాయములు చెప్పాను. హనుమంతుడు విభీషణుని friendship యేర్పరచుకున్నారు. ఒక సంభాషణలోపల విభీషణుడు చాలా బాధ పడుతున్నాడు. 'హనుమంతా నీవు ఎంత అదృష్టవంతుడవోయి. నిరంతరము రామసేవ యందు నిమగ్నమై వుంటున్నావు. రామానుగ్రహము నీవు పొందుతున్నావు. నేను ఎంత కాలమనుంచో రామ నామాన్ని స్మరిస్తున్నాను. కాని రామ దర్శనము నాకు ప్రాప్తించటం లేదు అన్నాడు. ఒక్కటి ప్రశ్న వేశాడు హనుమంతుడు. 'విభీషణా రామనామాన్ని స్మరిస్తున్నావే గాని రామ కార్యములో ఏమైనా పాల్గొంటున్నావా? రామ కార్యములో పాల్గొనక పోయినప్పుడు రామానుగ్రహము నీకు ఎట్లా లభిస్తుంది? పది నెలలైంది సీతా దేవి లంకలో ప్రవేశించి. ఆ సీత సహాయము రామసేవ కాదా! సీతకు కొంత వుపశాంతి యేమైనా బోధించావా? లేక సీతను ఒకసారైనా దర్శించావా? ఆమె బాధ నివారించటానికి యేమైనా కొన్ని వుపాయములు చేశావా? ఇంక నీకు రామానుగ్రహము ఎట్లా కలుగుతుంది? రామనామము రోమ రోమములలో వుండినప్పటికి రామకార్యములోనే నా జీవితము అంకితము చేశాను. మనము చేయవలసింది ఏమిటి? దిలోమ రామ సాధనము కాం. ఈ రెండింటి యందు మనము జీవితాన్ని అంకితము చేయాలి. ఇది ఆనాడు మహర్షులు చేసిన సాధన. ఆనాటి పరిశోధనలు కూడను పవిత్రమైన పరిశోధనలు చేస్తూ వచ్చారు. కనుక మానవుడు సామాన్యుడు కాడు. జంతూనాం నరజన్మ దుర్లభము. మానవ జన్మ చాలా దుర్లభమైనది. అటువంటి మానవత్వాన్ని మనము సార్థకము గావించుకోవాలనుకుంటే సాధ్యమైనంతవరకు దైవ చింతనలో దైవాన్వేషణలో మనము ప్రవేశించాలి.

విద్యార్థులారా! ఈనాటినుండి తిరిగి మరి కొన్ని మార్పులు చేయాలని సంకల్పించుకున్నాను. పిల్లలు అధికం కావటం చేత తెల్లవారి స్నానాలు చేసి స్వామి దర్శనానికి రావాలనుకుంటే రెండుగంటలకే పాపం పిల్లలు లేస్తున్నారు. రెండు గంటలనుండి ప్రారంభమై ఎనిమిది గంటలయ్యేటప్పటికి పిల్లల స్నానాలంతా పూర్తవుతాయి కనుక మధ్యాహ్నం క్లాసులన్నీ dull గా వుంటుంటాయి పాపం. రేపటినుండి మధ్యాహ్నం క్లాసులు మాని వేస్తాం. సాయంకాలము సమావేశములో ప్రవేశించేటప్పటికి మంచి fresh గా వుంటుంది mind. రేపు తెల్లవారి క్లాసులు మాత్రమే పెట్టి కాని 11-30కి ముగించుకొని మధ్యాహ్నం చక్కగా విశ్రాంతి తీసుకోండి. చిన్న విషయాలు మననం చేయండి. తరువాత నాలుగు గంటలకు ఇక్కడకు వచ్చినప్పుడు fresh గా రావచ్చు. కొంతమంది పిల్లలు ఇప్పుడు fresh గా లేరు. స్వామి మంచి విషయాలు చెబుతున్నా మధ్య మధ్య తూగుతున్నారు

ఇలాంటి పరిస్థితిలో ఎంత విలువైనవి అందించినప్పటికిని ప్రయోజనము వుండదు. వైస్ చాన్సలర్ ఈ కార్యక్రమంలో కొంచెం మార్పుచేసి రేపటి దినము తెల్లవారి మూడు క్లాసులు పెట్టుకొని మధ్యాహ్నము 11-30 నుండి free గా పిల్లలను విడిచిపెట్టాలి. ఇతర కాలమును మీరు వ్యర్థము చేయకూడదు. తెల్లవారి విన్న విషయాలను చక్కగా వ్రాసుకొని నోట్సు చదువుకోటం లేక విశ్రమించటం ఈ రెండూ చేసుకోవాలి గాని అనవసరమైన మాటలకు మీరు చోటు యివ్వకూడదు.

మానవుడు ఏ రీతిగా దైవత్వాన్ని చేరగలడు అనే విషయమును రేపటి నుండి మీ వైస్ చాన్సలర్ యిష్ట ప్రకారము నేను ప్రారంభిస్తాను. ఇది చాలా అవసరము. మానవుడై పుట్టినందుకు ఈ మానవత్వమును గుర్తించుకోవటము చాలా ప్రధానమైన సత్యం. ఎక్కడెక్కడ దేశములలో జరుగుతున్న వార్తలంతా మనం వింటున్నాం. కానీ తన నుండి వార్తలు తాను గుర్తించలేక పోతున్నాడు. బయటి నుండి వచ్చే న్యూస్ కంటె మనలో నుంచి వచ్చే న్యూసెన్సు చాలా అధికంగా వుంటున్నది. ఆ న్యూసెను మనం దూరం చేస్తే ఈ న్యూసెన్సు అంతా దూరమై పోతుంది. దీనిలో పవిత్రమైన దైవత్వాన్ని నింపుకోవచ్చు. రేపటి నుండి మీరంతా గుంపులుగా నిర్మలమైన హృదయంతో ఈ సమావేశములో మీరు పాల్గొన్నప్పుడు చాలా విలువైన విషయాలు మీరు అందుకోవలసి వస్తుంది. హృదయమనే పాత్రను పరిశుద్ధంగా గావించుకొనండి. ఏ శాస్త్రమునందుగాని, ఏ ఉపనిషత్తులందుగాని, ఏ వేదమునందుగాని లేనటువంటిది కాదు. అన్నీ వేదము యొక్క స్వరూపమే. ఇంత దానిని విపులంగా వివరించే వ్యక్తులు లేకపోవటం చేతనే అవి మనకు అర్థం కాక పోతున్నాయి. వాటిని నేను సులభంగా మీ స్థాయికి తగినట్లుగా అనుకూలవంతముగా ఆదర్శంగా, సాధనకు అనుకూలమైన విధంగా మను తప్పక చెప్పి హృదయాలను చక్కగా పవిత్రం గావించాలని నేను సంకల్పించుకున్నాను.